క్లుప్తంగా

కమిషనర్‌కు సన్మానం



శ్రీకాంత్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధిలో కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తన మార్క్ చూపించారని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక సుగుణ ఫంక్షన్ హాల్‌లో బదిలీపై వెళుతున్న కమిషనర్ శ్రీకాంత్‌కు వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై మన్ననలు అందుకున్నారన్నారు. అనంతరం కమిషనర్ దంపతులను సన్మానించారు. తహసీల్దార్ రంగాప్రసాద్, ఎస్‌ఐ నరేశ్, కొత్వాల శ్రీనివాసరావు, డీఈ మురళీ, ఏఈ రాజేశ్, టీపీఓ రాజేశ్ పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పేద మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు ఇవ్వనుండగా, దరఖాస్తు గడువు పొడిగించాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులు ఎవరికి సమర్పించాలో స్పష్టత లేకున్నా గురువారం వరకే గడువు విధించారని, వర్షాలు కురుస్తున్నందున మరింత సమయం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే, రాజకీయ నేతల జోక్యం లేకుండా కుట్టుమిషన్లు పంపిణీ చేయాలని కోరారు.

ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోండి

టేకులపల్లి: విద్యార్థులు ఆర్థిక క్రమ శిక్షణ అలవర్చుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి అన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న సీఎఫ్‌ఎల్ టేకులపల్లి సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకులు అందిస్తున్న సౌకర్యాలు, పొదుపు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆర్థిక ప్రణాళిక, ఆన్‌లైన్ పేమెంట్స్ చేసేటప్పుడు జాగ్రత్తల గురించా వివరించారు. ఆన్‌లైన్ పేమెంట్‌లో రిజర్వ్ బ్యాంక్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఇల్లెందురూరల్: గిరిజనేతరుల ఉద్యమాన్ని తప్పుపడుతూ ఆదివాసీ సంఘాలు రూపొందించిన కరపత్రాన్ని ఆదివాసీ సంఘాల జేఏసీ బుధవారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ఈసం నర్సింహారావు మాట్లాడుతూ.. తరతరాలుగా పోరాడి సాధించుకున్న 5వ షెడ్యూల్డ్, 1/70 చట్టాలను సవరించాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో రాజకీయ పక్షాలు వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈనెల 23న ఇల్లెందులో నిర్వహించే ప్రదర్శన, సభలకు ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రమణాల లక్ష్మయ్య, పట్టం కన్నయ్య, మీసాల రామచంద్రు పాల్గొన్నారు.

పునరావస కేంద్రానికి తరలింపు

కొత్తగూడెంఅర్బన్: పాతకొత్తగూడెం ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన ఇళ్ల ప్రజలను బుధవారం పునరావస కేంద్రానికి తరలించారు. కాలనీలో 25 ఇళ్లు శిథిలావస్థలో ఉండగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వారిని ఆర్డీఓ, తహసీల్దారు, కమిషనర్ ఆధ్వర్యంలో సమీపంలోని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడికి తరలించారు.

సబ్సిడీపై రైతులకు స్ప్రేయర్లు పంపిణీ

టేకులపల్లి: గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బుధవారం బద్దుతండా గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 50 శాతం రాయితీతో కిసాన్ క్రాఫ్ట్ కంపెనీ వారి డబుల్ బ్యాటరీ స్ప్రేయర్ పంపులను 70 మందికి పంపిణీ చేశారు. ఎండీ గడికొప్పుల రాం ప్రసాద్, సీఈఓ బి.నరేష్, ఎంఈఓ సురేందర్, టేకులపల్లి క్లస్టర్ మేనేజర్ నానిబాబు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

పాల్వంచరూరల్: మండల పరిధి దంతలబోరు ఎస్సీకాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం సర్పంచ్ గద్దల రమేష్ నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏడేళ్లుగా పాఠశాలను దత్తత తీసుకుని విద్యార్థులకు మెటీరియల్ అందిస్తూ ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. గత నెలలో తొమ్మిది మంది విద్యార్థులు గురుకులంలో సీటు సాధించినట్లు చెప్పారు. కార్యదర్శి రాజశేఖర్, హెచ్‌ఎం.యాదగిరి, ఉపసర్పంచ్ వెంకట నర్సింహ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: వెనకతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లు, బెల్ట్, టైలను బుధవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు బి.నరసింహా, బి.బాలకృష్ణల మిత్రుడు చిట్టిరామవరంకు చెందిన బి.రాంబాబు తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు షూ, బెల్ట్, టైలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ డి.మోతీలాల్, వైస్ చైర్మన్ ఎల్.రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా కేంద్రాలకు మోక్షమెప్పుడో?

- జిల్లాలో 12 హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం
- ప్రారంభోత్సవానికి ఎదురుచూపు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు



జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్

జూలూరుపాడు: ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం నిర్మించిన యోగా శిక్షణ కేంద్రాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. నేషనల్ ఆయుష్ మిషన్‌లో భాగంగా ప్రజలకు అనారోగ్య రాకుండా చూడటం, వస్తే త్వరగా నయం చేయడం, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం అందించి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించేందుకు ఆయుష్ ఆస్పత్రులను ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. జిల్లాలోని యునానీ, ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులను హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలుగా మారుస్తూ 12 ఆయుష్ వైద్యశాలలకు అనుబంధంగా యోగా శిక్షణ కోసం ఆరోగ్య స్వస్థత కేంద్రాలు (హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు) నిర్మించారు. ఒక్కో హెల్త్ వెల్‌నెస్ కేంద్రానికి జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రూ.6 లక్షలు మంజూరయ్యాయి. ఒక్కో సెంటర్‌లో యోగా షెడ్, ఇక్కడకు వచ్చే వారి కోసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. ఆరోగ్య స్వస్థత కేంద్రాలు వినియోగంలోకి వస్తే దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగరు, ఆస్తమా, కీళ్ల నొప్పులు, వాపులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ, జీర్ణకోశ వ్యాధులు, పక్షవాతంకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. జిల్లాలో 2 యూనాని వైద్యశాలలు, 7 ఆయుర్వేద వైద్యశాలలు, 3 హోమియో వైద్యశాలల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆర్లగూడెం ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ విభాగం, అశ్వారావుపేట ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ విభాగం, భద్రాచలం ప్రభుత్వం ఆయుర్వేద వైద్యశాల, భద్రాచలం ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ, భద్రాచలం ప్రభుత్వ యునానీ వైద్యశాల, ఆర్ కొత్తగూడెం ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ విభాగం, రొంపేడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, అశ్వాపురం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, ఇల్లెందు ప్రభుత్వ హోమియో వైద్యశాల, నాగుపల్లి(దమ్మపేట) ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, చంచుపల్లి ఆయుర్వేద వైద్యశాల, జూలూరుపాడు ప్రభుత్వ యునానీ వైద్యశాలలకు అనుబంధంగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్యశాలల్లో వైద్యం చేయించుకోవడానికి ప్రజలు అంతగా ముందుకు రాలేదు. కనీస సౌకర్యాలు, వైద్యులు, వైద్యసిబ్బంది, మందులు కొరత వంటి సమస్యలతో ఇబ్బందులు తలెత్తాయి. హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో వీటన్నింటినీ అధిగమించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కొన్నచోట్ల ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, సొంత భవనాల్లో, అద్దె భవనాల్లో ఆయుష్ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేద వైద్యశాలల ప్రాంగణాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను నిర్మించారు. ఆయుష్ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యశాలల్లో ప్రసుత్తం ఆయుర్వేదం, ప్రకృతి వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే ఆయుష్ వైద్యశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో యోగా శిక్షకుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఫార్మసిస్టు, పారా మెడికల్ సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంది. ఎక్కడా యోగా శిక్షకులను నియమించలేదు. యోగా శిక్షణా కేంద్రాలు నిర్మించి ఏడాది కావస్తున్నా ఏ కేంద్రంలోనూ యోగా శిక్షణ ప్రారంభించలేదు. దీంతో తాళాలు వేసి ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభం



ప్రస్తుతం ఉన్న ఆయుష్ వైద్యశాలలను హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చడం వల్ల ఆయుష్ వైద్యం ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తుంది. జిల్లాలో ఆయుష్ వైద్యశాలలకు అనుబంధంగా 12 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భారతీయ వైద్యవిధానంతో ప్రజలకు ఆయుర్వేద, యునానీ, హోమియో వైద్యం తోపాటు, యోగా ద్వారా మంచి ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేశాయి. ప్రభుత్వ నుంచి ఆదేశాలు రాగానే హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించడం జరుగుతుంది.

– డాక్టర్ రాజేందర్‌రావు,
ఆయుష్ డిపార్ట్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జ్

రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

సుజాతనగర్: రైతులు సంతోషంగా ఉండాలంటే పంటలు పండాలి, పంటలు పండాలంటే నాణ్యమైన విద్యుత్ ఉండాలి దీనిని ఇప్పటికే అమలు చేస్తున్న బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సుజాతనగర్ రైతు వేదికలో 24 గంటల ఉచిత విద్యుత్‌పై బుధవారం రైతు సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇది కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అస్తవ్యస్త విద్యుత్ సరఫరాతో రైతులు ఏ విధంగా ఇబ్బందులు పడ్డారో రైతులందరికీ తెలుసునన్నారు. రైతులకు 3 గంటల విద్యుత్ సరిపోతుందని రేవంత్ చెప్పడం సరికాదన్నారు. రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యతిరేకంగా రేవంత్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించాలన్నారు. అనంతరం 24 గంటల ఉచిత విద్యుత్‌ను కొనసాగించేలా రైతులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేందర్‌రావు, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం తులసిరెడ్డి, అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, గాజుల సీతారామయ్య, పెద్దమళ్ల నరేంద్రప్రసాద్, ఎంపీటీసీ మూడు గణేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

పాల్వంచ: స్థానిక పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో 60 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దాము, తహసీల్దార్ శర్మ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: ఉచిత విద్యుత్ పథకంపై కాంగ్రెస్ వైఖరిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడే స్పష్టం చేశారని, దీనిపై ఏం చేయాలో రైతులే నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. సుదిమళ్ల రైతు వేదికలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలోనే రైతు పథకాలను సీఎం కేసీఆర్ ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఉచిత నిరంతర విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, చెరువుల పునరుద్ధరణ, ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోళ్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ తదితర కార్యక్రమాలన్నీ రైతులకు మేలు చేశాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని కాంగ్రెస్ నాయకులు అధికారం కోసం అసత్యప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్‌గా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. శీలం రమేష్, దిండిగల రాజేందర్, చీమల నాగరత్నమ్మ, ప్రమోద్, మెట్టెల కృష్ణ, బండారు శ్రీను, కుంజ కృష్ణ, ఖమ్మంపాటి రేణుక, బండా వెంకన్న, ఘాజీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలకు అడ్డుకట్ట వేయండి



వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సభ్యులు

పాల్వంచరూరల్: పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రంలోని పాలకులకు ముందు చూపు లేకపోవడంతోనే నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజలు మూడు పూటల కడుపునిండా తినలేని పరిస్థితులు నేలకొన్నాయన్నారు. నిత్యావసరాలతోపాటు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో ధరలు తగ్గినప్పుడు ధరలను తగ్గించకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కూడలి సంఘమిత్ర, ఈశ్వరమ్మ, అనసూర్యమ్మ, త్రివేణి, కామిశెట్టి అప్పలమ్మ, మోతే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలిగా మధురవాణి



పాత, నూతన సేవా అధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా సమితి నూతన అధ్యక్షురాలిగా ఎం. మధురవాణి షాలెంరాజును, గతంలో ఏరియా సేవా అధ్యక్షురాలుగా కొనసాగిన జక్కం వాణీ రమేష్‌లను బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో సేవా సభ్యులు, సెక్రటరీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షురాలికి స్వాగతం పలుకుతూ, పాత అధ్యక్షురాలికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఫాతిమా రజాక్, రుద్రంపూర్, గౌతంపూర్, రామవరం సేవా సెక్రటరీలు, సేవా సభ్యులు ఆదిలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

నేడు డీ వార్మింగ్ డే



ఇల్లెందురూరల్: కొమరారంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జూలూరుపాడు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని 1– 19ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించనున్నట్లు జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాకేష్ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలో 10,420 మందితో మాత్రలు మింగించేందుకు ఏర్పాట్లు చేయగా... ఇందుకోసం 23 మంది వైద్యసిబ్బంది, 52మంది ఆశాకార్యకర్తలు, 62 మంది అంగన్‌వాడీ టీచర్లు, 59 మంది ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. కాగా, తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పక ఆల్బెండజోల్ మాత్ర మింగేలా చూడాలని కోరారు.

టేకులపల్లి: నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఇల్లెందు ఆరోగ్య సబ్ సెంటర్ అధికారి హరికృష్ణ పేర్కొన్నారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశానుసారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం ఈనెల 20వ తేదీన అన్ని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించనున్నారు. ఈ మేరకు బుధవారం సులానగర్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది.

కొత్తగూడెంఅర్బన్: నులిపురుగుల నిర్మూలన కోసం విద్యార్థులు తప్పని సరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి తెలిపారు. బుధవారం స్థానిక కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల అవగాహన కార్యక్రమం కొత్తగూడెం యూఎఫ్‌డబ్ల్యూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు.

ఇల్లెందురూరల్: నులి పురుగుల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత అన్నారు. ఈ మేరకు కొమరారం గ్రామంలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంఘర్షణ యాత్రను జయప్రదం చేయండి

జూలూరుపాడు: ఈనెల 21 నుంచి ఆగస్టు 1 వరకు జరగనున్న సంఘర్షణ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ, సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చర్ల నుంచి కలెక్టరేట్ వరకు ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కొత్తగూడెం డివిజన్ అధ్యక్షుడు బోడా అభిమిత్ర, పవన్, అనిల్, గణేష్, శ్రీరామ్, నరేందర్, శ్రీహర్ష, శివ, నవీన్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో విషజ్వరాలు మలేరియా, డెంగీ ప్రబలే అవకాశం ఉన్నందున తక్షణమే జిల్లాను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 4వ వార్డు పాతకొత్తగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం కొరవడిందన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

సుజాతనగర్: మండల కేంద్రంలోని ప్రధాన వీధులే కాదు. గల్లీల్లోనూ చెత్త కుప్పలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. 12 రోజులుగా పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రతిరోజూ ఉదయం ఇంటి వద్దకు వచ్చే వాహనాల్లో చెత్త వేసే ప్రజలు.. ఇప్పుడు వీధి చివరన పడేస్తున్నారు. ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలది కూడా అదే పరిస్థితి. ఎక్కడబడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గిరిజన విద్యపై ప్రభుత్వం చిన్నచూపు



మాట్లాడుతున్న రమేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: గిరిజన విద్యపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, గిరిజన సంక్షేమ హాస్టల్‌లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్ అన్నారు. బుధవారం కొత్తగూడెంలో బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని సంక్షేమ హాస్టల్‌లో కాస్మొటిక్స్ తదితర టెండర్లపై ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. గత ఏడాది, ఈ ఏడాది బిల్లులను చెల్లించడకపోవడంతో వార్డెన్లు మెనూ అందించడం లేదన్నారు. అప్పు తెచ్చి, బంగారం తాకట్టు పెట్టి పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ అందించలేకపోతున్నామని వార్డెర్లు వాపోతున్నారని తెలిపారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేక ప్యాకేజీ అందించాలని, తాగునీటికి ఆర్‌ఓ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గత ఏడాదితో పాటు ఈ ఏడాది మెస్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఎల్‌ఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగీలాల్ నాయక్, జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్, రవినాయక్, విష్ణు, ప్రసాద్‌నాయక్ తదిరుతులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు పన్ను తగ్గించండి

ఇల్లెందు: సింగరేణి కార్మికుల 11వ వేతన ఒప్పందం అగ్రిమెంట్ జరిగిన తర్వాత జీతంలో కొంత పెరుగుదల కనిపించినప్పటికీ దానిలో 30 శాతం కేంద్ర ప్రభుత్వం రికవరీ చేయడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ అనుబంధ సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు తెలిపారు. బుధవారం ఇల్లెందులోని జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో బడ్జెట్‌లో ఒక్క రాయితీ ఇవ్వలేదన్నారు. సీఎంపీఎఫ్‌పై వచ్చే వడ్డీ రూ. రెండున్నర లక్షలు దాటితే దాన్ని కూడా ఇన్‌కం ట్యాక్స్ పరిధిలోకి తీసుకొచ్చి ట్యాక్స్ రికవరీ చేయటం వల్ల ములిగే నక్క మీద తాటి పండు పడినట్లు ఉందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ట్యాక్స్ భారం తప్పడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం తక్షణం ట్యాక్స్ భారం తగ్గించాలని లేదంటే ఉద్యమం తప్పదన్నారు. సీఐటీయూ నాయకులు రమేష్, అబ్బాస్, సిరాజ్ అహ్మద్, రమ్ భరోస్ పాల్గొన్నారు.

సమ్మెకు సంఘీభావం తెలిపిన అఖిలపక్షం

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం వర్షంలోనూ తడుచుకుంటూ కొనసాగించారు. శిబిరాన్ని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఇఫ్టూ, ఏఐటీయూసీ నాయకులు సందర్శించి తమ మద్దతు తెలిపారు. మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



సుజాతనగర్: మద్దతు తెలుపుతున్న నాయకులు



చుంచుపల్లి: సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం



పెనుబల్లి లోలెవల్ వంతెనను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

పాల్వంచరూరల్: రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదనీరు చేరి జగన్నాథపురం హైస్కూల్ ప్రాంగణం చిన్నపాటి చెరువును తలపించింది. బుధవారం విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. జగన్నాథపురం, నాగారం, తోగ్గూడెం, కోడిపుంజులవాగు, పాండురంగాపురం, సోములగూడెం, రెడ్డిగూడెం తదితర గ్రామాల్లోని పత్తి, పెసర తదితర పంటల చేలల్లోకి వరదనీరు చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిరోడ్లు బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

జూలూరుపాడు: బుధవారం మండల వ్యాప్తంగా ముసురు పెట్టడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరింది. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

ఇల్లెందు: రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు అత్యవసర సమయంలో ఆదుకునేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అంకుషావలీ తెలిపారు. బుధవారం మున్సిపాల్టీలో కంట్రోల్ అధికారులు, సిబ్బందితో సమావేశంలో ఏర్పాటు చేశారు. పర్యవేక్షించే బాధ్యతను ఏఈ కుమారస్వామికి అప్పగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచరూరల్: వర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పాల్వంచ డీఎస్పీ ఎస్.వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రానున్న మరో ఐదురోజులపాటు భారీ వర్ష సూచన ఉన్నందున్న చెరువులు, కుంటలు తెగే ప్రమాదం ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు లోతట్టు వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, వంకల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద సహాయ చర్యలకు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

చుంచుపల్లి: చుంచుపల్లి మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలను బుధవారం జెడ్పీ సీఈఓ విద్యాలత పరిశీలించారు. పెనుబల్లిలోని గోధుమ వాగు, పెనుగడప గ్రామపంచాయతీలోని మూలుగ్గూడెం వాగులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. లోలెవెల్ వంతెనలు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఆమె వెంట మండల పంచాయతీ అధికారి గుంటి సత్యనారాయణ, సర్పంచ్ రెడ్డి శీను, ఈజీఎస్ ఈసీ పిల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, హనుమంతు తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

హెల్త్ సబ్ సెంటర్‌కు రక్షణ కరువు..

జూలూరుపాడు మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రానికి రక్షణ కరువైంది. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక కేంద్రానికి (పీహెచ్‌సీ) అతి సమీపంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ అధ్వానంగా ఉంది. తలుపులు, కిటికీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో విధులు నిర్వహించే ఏఎన్‌ఎం స్థానిక పీహెచ్‌సీలోనే ఉంటోంది. మందులు కూడా అక్కడే. వర్షం వస్తే హెల్త్ సబ్ సెంటర్ చుట్టూ వరదనీరు నిలుస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హెల్త్ సబ్ సెంటర్‌కు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : డాక్టర్ రాకేష్‌కుమార్,
పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, జూలూరుపాడు
సెల్ నంబర్: 9985998656